దేశ సేవకుడా.. సెలవిక...

- వీరుడికి కన్నీటి వీడ్కోలు ◆ శోకసంద్రంలో కళ్లితండా
- చివరి చూపునకు తరలి వచ్చిన 'అనంత' జనం ◆ గ్రామ రహదారి మొత్తం జనసంద్రం
- జోహార్ మురళీ నాయక్ అంటూ హోరెత్తిన నినాదాలు ◆ త్రివర్ణ పతాకం రెపరెపల నడుమ అంతిమయాత్ర
- బరువెక్కిన హృదయాలతో సైనికుడికి అంతిమ వీడ్కోలు ◆ హాజరైన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, పలువురు రాష్ట్ర మంత్రులు.

పాకిస్తాన్ కాల్పుల్లో అసువులు బాసిన అగ్నివీరుడికి ఆయన స్వగ్రామం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాలో ఆదివారం అశ్రు నయనాలతో తుది వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా కళ్లితండా శోకసంద్రంలో మునిగింది. వీరసైనికుడికి ప్రముఖులు నివాళి అర్పించారు. మంత్రి నారాలోకేష్ మురళీనాయక్ మృతదేహాన్ని మోసారు. ప్రభుత్వం నుంచి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, 300 గజాల ఇంటిస్థలం, 5 ఎకరాల భూమిని ఇస్తున్నట్లు ప్రకటించారు. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ వ్యక్తిగతంగా రూ. 25 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. మురళీనాయక్ భౌతిక కాయానికి అధికార లాంఛనాలతో వారి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వీరజవాను మురళీనాయక్ పార్థవ దేహానికి ఆఖరి సెల్యూట్ చేస్తున్న తల్లిదండ్రులు

పాకిస్తాన్ కాల్పుల్లో మృతి చెందిన వీర సైనికుడు మురళీ నాయక్ అంత్యక్రియలు ఆదివారం అశ్రునాయనాల నడుమ పూర్తయ్యాయి. మురళీ నాయక్ పార్థివ దేహాన్ని సందర్శించేందుకు అశేషంగా ప్రజలు తరలిరాగా, ప్రముఖులు పెద్దఎత్తున హాజరయ్యారు. గోరంట్ల మండలం కల్లితండాకు శనివారం రాత్రికే మురళీ పార్థివ దేహం చేరిన విషయం తెలిసిందే.అప్పటి నుంచే సందర్శకులు పెద్దఎత్తున కల్లితండాకు తరలొచ్చి వీర సైనికుడి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు మురళీ నాయక్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి

పాక్ కాల్పుల్లో మృతి చెందిన మురళీ నాయక్ అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. ఈ అంత్యక్రియలకు సైనికాధికారులతోపాటు, రాష్ట్ర పోలీసులు శాఖ తరుపున పోలీసు సిబ్బంది మురళీ నాయక్ ఇంటి నుంచి వారి వ్యవసాయ క్షేత్ర వరకు పెరేడ్‌గా తీసుకెళ్లారు. ఈ సమయంలో మురళీ నాయక్ అమర్ రహే... భారత మాతాకి జై అన్న నినాదాలు హోరెత్తాయి. అంత్యక్రియలు జరిగే ప్రాంతంలో గన్ షెల్యూట్‌తో గౌరవ వందనాన్ని అందించారు. అనంతరం జాతీయ పతకాన్ని మురళీనాయక్ తండ్రికి అందజేశారు. ఆ సమయంలో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. సందర్శకులు ఉద్విగ్నతకు లోనయ్యారు.

అండగా ఉంటాం : ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

మురళీ నాయక్ కుటుంబానికి తమ ప్రభుత్వం తరుపున పూర్తి స్థాయిలో అండగా ఉంటామని మురళీ నాయక్ తల్లిదండ్రులకు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ భరోసానందించారు. వారి వద్ద కూర్చొని ఓదార్చారు. క్యాబినేట్‌లో చర్చించి ఐదు ఎకరాల పొలంతోపాటు, ఇంటి నిర్మాణానికి 300 గజాల స్థలం కేటాయిస్తామని హామీనిచ్చారు. అంతేకాకుండా ప్రభుత్వం తరుపున అందే సహాయమే కాకుండా తాను వ్యక్తిగతంగా రూ.25 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని ప్రకటించారు.

భౌతికకాయాన్ని మోసిన నారా లోకేశ్

వీర మరణం పొందిన మురళీ నాయక్ భౌతికకాయాన్ని నారా లోకేశ్ మోశారు. అంతకు మునుపు మురళీనాయక్ పార్థవదేహం వద్ద పుష్పగుచ్చం ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. చిన్న వయసులో దేశ రక్షణలో మురళీనాయక్ అశువులుబాయడం బాధాకరమన్నారు. ఆయన జ్ఞాపకార్థం గ్రామంలో స్థూపాన్ని నిర్మిస్తామని చెప్పారు. గ్రామస్తుల కోరిక మేరకు కల్లితండా పేరును మురళీ నాయక్ తండాగా మారుస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.50 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందిస్తామని, మురళీనాయక్ తండ్రికి ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు.

కదిలివచ్చిన అశేష జనవాహిని

గోరంట్ల : పాకిస్తాన్ కాల్పుల్లో మృతిచెందిన వీరజవాను మురళీనాయక్ అంత్యక్రియలకు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అశేషజనవాహిని తరలివచ్చారు. మురళీనాయక్ స్వగ్రామం కల్లి తండాలో ఆదివారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, సవితమ్మ, అనగాని సత్య ప్రసాద్, హోం మంత్రి అనిత, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ వీర జవానుకు నివాళు లర్పించారు అగ్నివీర్ మురళి నాయక్ తల్లిదండ్రులను పరామర్శించారు. మురళి నాయక్ ఇంటి నుండి వ్యవసాయ క్షేత్రం వరకు సాగిన అంతిమయాత్రలో అశేషజనవాహిని పాల్గొంది. అంత్యక్రియల్లో భాగంగా ఆర్మీ పోలీసులు గాల్లోకి మూడుసార్లు కాల్పులు జరిపారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, పల్లె సింధూర, కాలవ శ్రీనివాసులు, టిడిపి నాయకులు పరిటాల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మురళి నాయక్ యువతకు ఆదర్శం

పుట్టపర్తి రూరల్ : దేశ సరిహద్దులో వీర మరణం పొందిన అగ్ని వీరుడు జవాన్ మురళి నాయక్ కుటుంబానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భరోసా ఇచ్చారు. మురళి నాయక్ పార్థివదేహం వద్ద పుష్పగుచ్చం ఉంచి నివాళి అర్పించారు. అనంతరం మురళి నాయక్ తల్లిదండ్రులు శ్రీరామ్ నాయక్, జ్యోతిబాయ్‌నిపరామర్శించి, ఓదార్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మురళి నాయక్ వీరమరణం నేటి యువతకు ఆదర్శంగా ఉందన్నారు. పాతికేళ్ల వయసులో దేశం కోసం ప్రాణాలర్పించి, భారత ప్రజల హృదయాలను గెలుచుకున్న నిజమైన హీరోగా నిలిచిపోయారన్నారు. పోలీస్ అధికారులు సిబ్బంది సమన్వయంతో వీర జవాన్ అంత్యక్రియలు ప్రశాంతంగా ముగిసే విధంగా విధులు నిర్వర్తించారు. పోలీస్ అధికారులు సిబ్బందితో పాటు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన అందరికీ జిల్లా ఎస్పీ రత్న కృతజ్ఞతలు తెలిపారు.

వీరజవాను మురళీనాయక్ పార్థవ దేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రులు, తదితరులు

మురళీనాయక్ తల్లిదండ్రులను ఓదార్చుతున్న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్

మురళీనాయక్ పార్థివదేహాన్ని మోస్తున్న మంత్రి నారాలోకేష్

మోడీ.. 2 కోట్ల ఉద్యోగాలు ఏవీ..?

జిల్లాలో సోలార్ కాకుండా ఉపాధి కల్పించే పరిశ్రమలు రావాలి - డివైఎఫ్ఐ జిల్లా మహాసభల్లో నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలో తాము అధికారం ఇస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, పూర్వ రాష్ట్ర నాయకులు వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని హెచ్ఎల్‌సి కాలనీలో ఉన్న మెడికల్ హాల్‌లో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) 14వ జిలా మహాసభలను ఘనంగా నిర్వహించారు. తొలుత వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జి.రామన్న, వి.రామిరెడ్డి మాట్లాడుతూ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చి 11ఏళ్లు పూర్తయిందన్నారు. దేశంలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగిందన్నారు. డిగ్రీ పూర్తయిన 25ఏళ్ల లోపు యువతలో 43 శాతం మందికి ఎలాంటి ఉద్యోగాలు లేవన్నారు. రైల్వే, బ్యాంకు,పోస్టల్, టెలికం, ఓడరేవులు, విమానాశ్రయాలు, ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరించడం ద్వారా కొత్త ఉద్యోగాలు కాదు కదా ఉన్న ఉద్యోగాల ఊడిపోయాయని మండిపడ్డారు. 2017- 2022 మధ్య రెండు కోట్ల మంది మహిళలు ఉపాధి కోల్పోయారని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు ప్రకటించాయని, అన్ని రంగాల్లో తక్కువ వేతనం, భద్రత లేని కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాలు అమలవుతున్నాయని తెలిపారు. 25 నుంచి 30ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు జిల్లాలో సుమారు 4 లక్షల మంది ఉన్నారన్నారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలకు అత్యంత సమీపంగా ఉన్న ప్రాంతం అనంతపురం జిల్లానే అని, ఇన్ని అనుకూలతలు ఉన్నా 15ఏళ్లలో కనీసం వెయ్యి మందికి ఉపాధి చూపే ఒక్క పరిశ్రమ జిల్లాకు రాలేదన్నారు. మరోవైపు సోలార్ విద్యుత్ ఉత్పత్తికి వేలాది ఎకరాలు అప్పగిస్తున్నారని, వీటివల్ల లక్షల మంది రైతు, కూలీలు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. యువతకు వచ్చే ఉద్యోగాలు అతి తక్కువ అన్నారు. ఉపాధి లేని చదువులు ఎందుకని యువత ప్రశ్నిస్తోందన్నారు. సోలార్ ప్లాంట్‌లు కాకుండా ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వీటి సాధన కోసం రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలు కొనసాగిస్తామని వారు తెలిపారు.

డివైఎఫ్ఐ నూతన కమిటీ సభ్యులతో వి.రామిరెడ్డి

నూతన కమిటీ ఎన్నిక

25 మంది సభ్యులతో డివైఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బాలకృష్ణ, జిల్లా కార్యదర్శిగా కసాపురం రమేష్, జిల్లా ఉపాధ్యక్షులుగా సురేంద్ర, అశోక్, నూరుల్లా, జిల్లా సహాయ కార్యదర్శులుగా సోము, నెట్టికల్లు కోశాధికారిగా చరణ్‌కుమార్‌తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నల్లచెరువు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

లారీని ఢీకొన్న కారు... ముగ్గురు మృతి

ప్రజాశక్తి - నల్లచెరువు

రోడ్డు ప్రక్కన నిలిచి ఉన్న ట్రిప్పర్ లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారు మదనపల్లివాసులని పోలీసులు తెలిపారు. నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లి సమీపంలో ఆదివారం జరిగిన ఈ రోడ్డు ప్రమాదానికి సంబంధించిన పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... నెల్లూరుకు చెందిన రిటైర్డ్ లెక్చరర్ వేణుగోపాల్ అనే వ్యక్తికి సంబంధించిన బంధువులు అనంతపురంలో మృతిచెందగా చూడటానికి తమ సమీప బంధువులైన మదనపల్లికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ జయచంద్ర, కానిస్టేబుల్ చలపతి, లెక్చరర్ నాగేంద్రతో కలసి కారులో వచ్చాడు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న కారు నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లి సమీపంలో ఆగి ఉన్న ట్రిప్పర్ లారీని ఢీకొని పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ జయచంద్ర (60), కానిస్టేబుల్ చలపతి(56), లెక్చలర్ నాగేంద్ర (58) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్ర గాయాలపాలైన వేణుగోపాల్‌ను చికిత్స నిమిత్తం కదిరి ఆసుపత్రికి తరలించారు. మృతులు ముగ్గురు సొంత అన్నదమ్ములు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. ప్రమాద విషయం తెలుసుకున్న కదిరి సీఐ నాగేంద్ర తనకల్లు ఎస్ఐ గోపీ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు, కారులో మృతదేహాలు

పరిశ్రమల స్థాపనతోనే యువతకు ఉపాధి

జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జె. నాగరాజు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పరిశ్రమల స్థాపనతోనే యువతకు ఉపాధి లభిస్తుందని ప్రత్యక్షంగా పరోక్షంగా పలువురికి ఉపాధి దొరుకుతుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జె. నాగరాజు పేర్కొన్నారు. జిల్లాలో తరచూ అతివృష్టి, అనావృష్టి కారణాలతో వ్యవసాయంతో రైతాంగం నష్టాల పాలవుతోంది. జిల్లాలో చెప్పుకోదగ్గ పరిశ్రమలు లేకపోవడం వల్ల కూడా యువతకు ఉపాధి దొరకక నగరాలకు తరలిపోతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పడానికి తగిన చర్యలు చేపట్టాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం అనేక రాయితీలు కల్పించడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పనకు శ్రీకారం చుడుతున్నాయి. పెద్ద పరిశ్రమలకు సైతం భూమి, విద్యుత్ తో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. హంద్రీనీవా కాలువ ద్వారా నీటి సమస్య తీరుతోంది. భూమి, మానవ వనరులతో పాటు జాతీయ రహదారులు నిర్మిస్తుండటం పరిశ్రమ స్థాపనకు జిల్లా అనుకూలంగా మారుతోంది. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం తగిన చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు గురించి జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జె. నాగరాజు ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలు వివరించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి వీటిలో సూక్ష్మ, చిన్న, మధ్యతర, పెద్ద పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి?

జవాబు : జిల్లాలో సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలు 8,898 ఉన్నాయి. ఇవి రూ. 1903 కోట్ల పెట్టుబడి తో స్థాపించబడి ఉన్నాయి. వీటి ద్వారా 55,612 మందికి ఉపాధి లభిస్తోంది. పెద్ద పరిశ్రమలు 48 ఉన్నాయి. ఇందులో రూ. 16.457 కోట్ల పెట్టుబడితో నడుస్తున్నాయి. వీటి ద్వారా 25,682 మందికి ఉపాధి దొరుకుతోంది. వివిధ దశల్లో భారీ పరిశ్రమలు 28 నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో రూ.20,700 కోట్ల పెట్టుబడి పెట్టడం జరుగుతోంది. ఈ నిర్మాణాలు పూర్తి అయితే 28,573 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. ఎక్కువగా పరిశ్రమలు హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం తదితర ప్రాంతాల్లో ఉన్నాయి.

ప్ర : పరిశ్రమల ఏర్పాటుకు నూతన ఔత్సాహితులకు మీరు ఇస్తున్న సహకారం వివరించండి?

జ : పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే నూతన పారిశ్రామికవేత్తలకు అవసరమైన భూమి కేటాయింపులు మొదలుకొని వాటికి కావాల్సిన అనుమతులు త్వరగతిన రావడానికి తగు చర్యలు తీసుకుంటాం. తద్వారా అర్హత ఉన్న పరిశ్రమలకు ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన పాలసీ మేరకు 5 ఏళ్ల పాటు రాయితీలు అందించడం జరుగుతుంది. ఇందులో పెట్టుబడిలో రాయితీ, విద్యుత్ రాయితీ, జి ఎస్ టి లో రాయితీ, స్టాంప్ డ్యూటీ రాయితీ, భూమి కేటాయింపులో రాయితీ మొదలగు వాటిని సమకూర్చడం జరుగుతుంది. ఎస్సీ, ఎస్టీ లు అయితే మరిన్ని రాయితీలు అందుకోవచ్చు.

ప్ర: పరిశ్రమల స్థాపనకు ఉండాల్సిన అర్హతలు ఏమిటి?

జ : పెట్టబోయే పరిశ్రమపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. భూమి కలిగిన లేదా కొనుగోలు చేసిన వాటితో పాటు సొంతంగా పెట్టుబడి పెట్టగలిగిన స్తోమత కలిగి ఉన్న లేదా బ్యాంకు రుణ సదుపాయాలు వల్ల కూడా పరిశ్రమ స్థాపించుకోవచ్చు.

ప్ర : గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి జిల్లాలో ఎన్ని పరిశ్రమలు స్థాపించారు? మీ సహకారం ఏమిటి?

జ : సింగల్ డెస్క్ పోర్టరు ద్వారా ఇప్పటివరకు 4054 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయడం జరిగింది. దరఖాస్తు చేసుకున్న అర్హత కలిగిన వారికి 21 రోజుల లోపు అనుమతులు ఇస్తాం. ఇందులో ముఖ్యంగా విద్యుత్ సదుపాయం, భవన నిర్మాణ ప్లాన్, కర్మాగారాల శాఖ అనుమతి, కాలుష్య నియంత్రణ కంట్రోల్ శాఖ అనుమతి, పట్టణ అభివృద్ధి అథారిటీ మంజూరు, అగ్నిమాపక లైసెన్స్, భూగర్భ జల శాఖ అనుమతులు మంజూరుకు సహకారం అందిస్తాం.

ప్ర : జిల్లాలో ఏయే పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉంది?

జ : ప్లాస్టిక్ వాటి అనుబంధ పరిశ్రమలు ఇంజనీరింగ్, టెక్స్‌టైల్స్ రంగంలో వస్త్రాల తయారీ, ప్లాస్టిక్ పైపులు డ్రిప్పు పైపులు ఆహార శుద్ధి పరిశ్రమలు, రైస్ మిల్లులు, దాల్ మిల్లులు, స్టీల్ తయారీ, ఉడన్, పవర్ లూమ్స్, సిల్క్ స్టిచ్చింగ్, సిల్క్ రీలింగ్, పాల ఉత్పత్తి, చిరుధాన్యాల ప్రాసెసింగ్ తదితర పరిశ్రమల స్థాపనకు జిల్లా అనుకూలంగా ఉంది.

ప్ర : ప్రధానంగా మీ శాఖ ద్వారా చేపడుతున్న పనులు, విధి విధానాలు ఏమిటి?

జ : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, పెట్టుబడులు పెట్టే వారికి అవగాహన కల్పించడం, బ్యాంకు రుణ సదుపాయాల కల్పన, పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించడం, రాయితీలు మంజూరు చేయడం, జిల్లాస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను కలెక్టర్ అధ్యక్షతన జరిగే పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక జిల్లా కమిటీలో చర్చించి, రాష్ట్రస్థాయి కమిటీకి నివేదించడం జరుగుతుంది.

ప్ర: మీశాఖలో సిబ్బంది కొరత ఉందా? ఔత్సాహిక పారిశ్రామిక యువతకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి?

జ: ఒక అసిస్టెంట్ డైరెక్టర్, మూడు పరిశ్రమల అభివృద్ధి అధికారుల పోస్టులు భర్తీ చేయాల్సుంది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలి. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా రాష్ట్ర దేశ ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించాలి. రాష్ట్ర జిడిపి, తలసరి ఆదాయం పెంపొందించడానికి ముందుకు రావాలి. వారి అభివృద్ధి తో పాటు సమాజ అభివృద్ధికి కృచేయాలని కోరుతున్నాము.

ప్రజాశక్తి
www.prajasakti.com

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి

ప్రజాశక్తి-బెలుగుప్ప

ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దామని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణంతోపాటు ఇతర కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి దేశంలోని కార్మికులంతా ఒక్కటై 20వతేదీన సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి అశోక్, మారెన్న, భీమన్న, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

యాడికి అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి

ప్రజాశక్తి-యాడికి

యాడికి పంచాయతీ అభివృద్ధిపై ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి దృష్టి సారించారు. ఇటీవల యాడికిలో పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానికులు పలు సమస్యలపై విన్నవించిన విషయం తెలిసిందే ముఖ్యంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే యాడికిలో అస్తవ్యస్తంగా ఉన్న తాగునీటి పైపులైన్ల సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలో అపరిశుభ్రత నెలకొనడంతో బాగు చేయాలని టిడిపి నాయకులకు సూచించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు ఆధ్వర్యంలో మూలన పడిన ఆటో రిక్షాలను బాగు చేయించే కార్యక్రమం చేపట్టారు. పలు కాలనీల్లో డ్రెయినేజీ సమస్యలతోపాటు మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్నారు.

వీరుడా.. సెలవు..

వీరజవాను మురళీనాయక్‌కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇండియా-పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నివాళులర్పించారు. ఈమేరకు గోరంట్ల మండలం కల్లితండాకు చేరుకుని మురళి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారాలోకేష్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ మురళీనాయక్ చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలర్పించడం గర్వించదగ్గ విషయమన్నారు. అయితే తల్లిదండ్రులను చూస్తుంటే ఇలాంటి బాధ మరో ఏ సైనికుని కుటుంబానికి రాకూడదన్నారు. మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకాంక్షించారు.

అలాగే సాయంత్రం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పిలుపుమేరకు ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ సోదరులు, ముస్లిం మహిళలు బూరుఖాలు ధరించి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్‌మేవా నాయకులు షేక్షావలి, దౌలా, జిలాన్, టిడిపి నాయకులు సాలర్‌బాషా, సైపుద్దీన్, ఖలందర్, ఎంజె బాషా, స్వామిదాస్, ముస్లిం మహిళా నాయకురాలు రేష్మ, షానాజ్, కరిష్మా, ఫాతిమా, ముస్లిం మత పెద్దలు, క్రిస్టియన్ ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు గుత్తిలో వైసిపి నాయకులు నివాళులర్పించారు. స్థానిక పట్టణంలోని గ్రంథాలయ సమీపంలో చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు డి.హుస్సేన్‌పీరా, గురుప్రసాద్ యాదవ్, సివి రంగారెడ్డి, ఎం.రంగస్వామి, బి.రమేష్‌రెడ్డి, బింగి కిరణ్‌బాబు, సునీల్‌కుమార్, పుల్లారెడ్డి, వెల్డింగ్ రవూఫ్, మల్లికార్జున, రాజేష్, అబ్దుల్, కౌన్సిలర్లు వాల్మీకి శివ, కెవి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

పుట్లూరు : మండలంలోని శనిగల గూడూరు గ్రామంలో జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

యాడికి : యుద్ధంలో అసువులు బాసిన సత్యసాయి జిల్లా కల్లితండాకు చెందిన మురళీనాయక్‌కు మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళి విరోచిత పోరాటాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన యాడికి మండల కన్వీనర్ సునీల్‌కుమార్ నాయకులు జాకీర్, దస్తగిరి, వెంకటేష్, మధుఆచారి, గుండ్ల శివ, మహేష్, రాము, జనసైనికులు పాల్గొన్నారు.

శింగనమల : యుద్ధవీరుడు మురళీనాయక్‌కు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీ చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. నివాళులర్పించిన వారిలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట ఓబులేసు, యువ నాయకుడు తోట రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : యుద్ధవీరుడు మురళీనాయక్‌కు నివాళులర్పిస్తూ మండల పరిధిలోని సిద్ధరాచర్ల సర్పంచు సాకే రామాంజినేయులు ఆధ్వర్యంలో దుర్గం గ్రామంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు.

సింహ వాహనంపై నారసింహుడు

పల్లకిలో విహరిస్తున్న నారసింహుడు

ఉరవకొండ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నఅహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నృసింహ జయంతి సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ రకాల పూలతో స్వామివారిని అందంగా అలంకరించారు. మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం స్వామివారు సింహ వాహనంపై విహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి సాకే రమేష్‌బాబు, అర్చకులు ద్వారాకనాథ్, మయూరం బాలాజీ పాల్గొన్నారు.

చౌకధాన్యం డిపో తనిఖీ

నార్పల : మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో ఉన్న చౌకధాన్యం డిపోను పౌర సరఫరాల శాఖ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, సిఎస్‌డిటి చంద్రకళ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ సక్రమంగా పంపిణీ చేయడం లేదని నడిమిదొడ్డి గ్రామస్తులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ విషయంపై ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన అధికారులు నడిమిదొడ్డి గ్రామంలోని చౌకధాన్యం దుకాణానికి చేరుకుని పరిశీలించారు. ఇందులో భాగంగా స్టాకు, కార్డుదారుల వివరాలను పరిశీలించారు. రేషన్ కార్డుదారులు అందరికీ రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

పామిడి : స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సర్కిల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో తరిమెల రాజు కళా బృందంతో నాటకం ద్వారా హెఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాంగా హెచ్ఐవి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు.. రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులపై వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలా చూడాలన్న విషయాలపై వివరించారు. ఈ కార్యక్రమములో ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్, ఓఆర్‌డబ్ల్యూ జోష్ణ, కృష్ణవేణి, షంషాద్, కళాకారులు వెంకటేశు, తిప్పేస్వామి, పుష్ప, సరోజ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వినాయకుడి విగ్రహ ప్రతిష్టాపన

పామిడి : ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాజగోపాల్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సహాయ సహకారాలతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించారు. అలాగే జాతీయ జెండా వేదికను టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పూజారులు, దాతలు, టిడిపి నాయకులు ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాసరెడ్డి, కుమార్, బొమ్మ మోహన్, శివశంకర్, రాష్ట్ర డైరెక్టర్లు, వ్యక్తిత్వ వికాస నిపుణులు లీలా మనోహర్, నిమ్మకాయల ప్రసాద్, లక్ష్మీపతి, నాగరాజు, నరేష్, అసుపత్రి సిబ్బంది ఓబిరెడ్డి, ఓబిలేసు, రామాంజినేయులు, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

యాడికి : మండల కేంద్రంలోని విజన్ హైస్కూల్‌లో ఆదివారం విశాలాక్షి ట్రస్టు పిహెచ్ఆర్‌సి ఆధ్వర్యంలో అనంతపురం సవేరా ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో వైద్యులు సందీప్‌రెడ్డి, నరేంద్ర, సాంబ కలిసి సుమారు 86 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 11 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు విశ్వనాథ్, స్టేట్ జనరల్ సెక్రటరీ గుండా నారాయణస్వామి, లింగం చంద్రశేఖర్, మురళి, శివ కోటి, రవి, శివ, హరి, పరమేశ్వర్‌రెడ్డి, మల్లికార్జున, రామిరెడ్డి, ఓబులేసు, కుండా లక్ష్మీనారాయణ, అమర్, ప్రసాద్, శేఖర్, దత్తాత్రేయ, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎలక్ట్రీషియన్ మృతి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని తోళ్లషాపు కాలనీలో ఓ ఎలక్ట్రిషన్ గుండెపోటుతో మృతిచెందాడు. వైఎస్ఆర్ జిల్లా కమలాపురానికి చెందిన జి.అమీర్‌బాషా (47) గుత్తి అర్ఎస్‌లో 20 ఏళ్ల క్రితం వివాహం చేసుకుని ఇక్కడే స్థిర పడ్డాడు. అయితే మూడేళ్లుగా భార్య, ఇద్దరు కుమార్తెలకు దూరంగా ఉంటూ ప్లంబర్‌తో పాటుగా ఎలక్ట్రీషియన్‌గా పని చేసి జీవనం కొనసాగించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి బయట భోజనం తీసుకెళ్లి ప్లేట్‌లో పెట్టుకుని తింటుండగా ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. అయితే రెండు రోజులుగా అమీర్ రాలేదని స్నేహితుడు హోటల్‌లో పని చేసే అబ్బాయిని పంపగా అప్పటికే ఇంట్లో మృతి చెంది ఉండటం గమణించి 100కు డయల్ చేసి సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ సురేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అమీర్ భాష గుండెపోటుతో మరణించి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

వజ్రగిరి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని తిమ్మనచెరువు కొండపై ఉన్న వజ్రగిరి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ధ్వజారోహణతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గణపతి పూజ చేశారు. సాయంత్రం జూటూరు గ్రామంలో ఉన్న జెసి బాలనాగిరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. శ్రీదేవి భూదేవి సమేతుడైన నరసింహస్వామికి అర్చకులు సోమవారం ఉదయం కళ్యాణం నిర్వహించనున్నారు. ఆదివారం రాత్రికి భక్తాదుల కోసం సంగీత విభావరి ఏర్పాటు చేశారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

ఉరవకొండ : మండల కేంద్రంలోని చావిడి కట్ట నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారి మీదుగా మెయిన్ రోడ్డు వరకూ చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను సర్పంచు బోయ చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు. సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ టిడిపి సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సిసి రోడ్లతోపాటు డ్రెయినేజీ పనులను వేగంగా చేయడమే కాకుండా నాణ్యతతో చేయాలని పయ్యావుల సోదరులు సూచించినట్లు వివరించారు.

ఆర్డీటీని కాపాడుకోవడం అందరి బాధ్యత

రిలే దీక్షలో టివి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆర్‌డిటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న అడ్డంకులు, ఆంక్షలను తొలగించేంత వరకూ అందరం బాధ్యతగా పోరాడుదామని క్రికెట్ కోచ్ టివి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎ రెన్యువల్ వెంటనే చేయాలని ప్రజా సంఘం నాయకుడు సుగమంచి శ్రీనివాసులు అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 7వరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌డిటిలో వేలాది మంది విద్యార్థిని విద్యార్థులకు క్రీడల్లో రాణించే విధంగా సంస్థ కోట్ల రూపాయల ఖర్చు చేసిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం కూడా ఏర్పాటు చేసి జిల్లాకు పేరు తెచ్చిన ఘనత ఆర్‌డిటి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కే దక్కుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలనే కాకుండా పట్టణ నగర ప్రాంతాల్లో కూడా అభివద్ధికి అడుగులు వేసిన ఆర్డిటిని అనంతపురం జిల్లా ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. అఖిలపక్ష కమిటీ జేఏసీ కన్వీనర్ సాకే హరి మాట్లాడుతూ పేదల పక్షపాతి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కలలు సాకారం కావాలంటే ఆర్‌డిటిని కాపాడుకోవడమే మొదటి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఓబులేసు, టీవీ.రెడ్డి, బికెఎస్ ఆనంద్, ప్రభాకర్, భీమసేన రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పిఆర్‌సి ప్రకటించాలి

యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం 12వ పిఆర్‌సి కమిటీ ఛైర్మన్‌ని నియమించడంతోపాటు నూతన పిఆర్‌సి ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణ పాఠశాల అనంతపురంలో యుటిఎఫ్ ఉద్యమ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఒకవేళ కమిషన్ ఏర్పాటు ఆలస్యమయ్యే పక్షంలో ఉద్యోగులకు 30 శాతం మద్యంతర భృ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, జిల్లా కార్యదర్శులు హనుమంత్ రెడ్డి, రవికుమార్, సుబ్బరాయుడు, శేఖర్, రాముడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు నాగేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, నాయకులు భీమేష్, సబ్ కమిటీ కన్వీనర్ రామాంజనేయులు, ఆడిట్ కమిటీ సభ్యులు రాజశేఖర్, సూర్యనారాయణ, రాజేంద్ర వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.సురేష్‌కుమార్

లోకేష్ పర్యటనను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-పామిడి

విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఈనెల ఈనెల 15వతేదీన గుత్తి పర్యటనను విజయవంతం చేద్దామని టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు జయరామ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా దేశ రక్షణలో ప్రాణాలర్పించిన సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గంలోని గుత్తిలో ఈనెల 15న నారా లోకేష్ పర్యటించనున్నట్లు తెలిపారు. చిన్న చిన్న మనస్పర్థలు ఉన్నా పక్కన పెట్టి విజయవంతం చేద్దామన్నారు. అలాగే రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా మన అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, హిమబిందు, బొమ్మా మోహన్, పాళ్యం శేఖర్, కరూరు శివశంకర్, పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మనూరు ఈశ్వర్

అమ్మకు గుర్తుగా.. పేదలకు తోడుగా..

ఉచిత క్యాన్సర్ శిబిరం

ప్రజాశక్తి-రాయదుర్గం

కాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించగలిగితే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం పట్టణంలోని ఎపి మోడల్ స్కూల్ ఆవరణలో హైదరాబాద్‌కు చెందిన బసవతారకం స్మారక కాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కాన్సర్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ తల్లుల దినోత్సవం నాడు అమ్మకు గుర్తుగా నిర్వహిస్తున్న క్యాన్సర్ నిర్ధారణ శిబిరంలో ఎక్కువ మంది పేద మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. భయంకరమైన కాన్సర్ ఏటా అనేక మంది ప్రాణాలను కబలిస్తోందన్నారు. కాన్సర్ మహమ్మారితో తన తల్లి పడ్డ వేదన గుర్తుకొస్తే, ఇప్పటికీ ఎంతో బాధ కలుగుతుందన్నారు. అలాంటి బాధ ఇతరులకు రాకూడదనే ఉద్దేశంతోనే బసవతారకం ఆస్పత్రి సహకారంతో రాయదుర్గంలో ఉచిత కాన్సర్ నిర్ధారణ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు హనుమంతురెడ్డి, పురుషోత్తం, ఇనాయత్‌బాషా, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలను అడిగి తెలుసుకుంటున్న కాలవ శ్రీనివాసులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక చోటు కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో చదువు చెప్పిన తెలుగు పండిట్ శ్రీనివాసులు, దివాకర్‌రెడ్డి, మునిస్వామి, శేఖర్, రామ్‌భూపాల్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఒకరినొకరు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. అప్పట్లోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-1988లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ముందుగా గురువులకు సన్మానించారు. అనంతరం ఒకరినొకరు పరిచయ చేసుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తర్వాత చదువుకున్న పాఠశాల కోసం రూ.20వేలు విలువజేసే స్టేజి సంబంధించిన మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు నాగిరెడ్డి, శేషారెడ్డి, అంకిరెడ్డి, ఎంఇఒ ప్రేమ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న విశ్రాంత జడ్జి దంపతులు

దశభుజ గణపతి ఆలయాన్ని సందర్శించిన హైకోర్టు రిటైర్డ్ జడ్జి

రాయదుర్గం : పట్టణంలోని దశభుజ గణపతి ఆలయాన్ని హైకోర్టు విశ్రాంత జడ్జి ఆకుల వెంకట శేషసాయి దంపతులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు జడ్జి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దశభుజ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అర్చకులు దశభుజ గణపతి చిత్రపటాన్ని రిటైర్డ్ జడ్జి దంపతులకు అందజేసి సత్కరించారు. వెంకట శేషసాయి ఆలయ పురాతన హిందూ హైందవ సంప్రదాయాలపై అర్చకులతో చర్చించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి రమ్య వారివెంట ఉన్నారు. స్థానిక పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉచిత ఖత్నా

ప్రజాశక్తి-కణేకల్లు

మండల కేంద్రంలోని ఎస్‌ఎస్‌బి హెల్త్ కేర్ సెంటర్ ఛైర్మన్ షాకీర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్రంలోని గఫూర్ ఆసుపత్రి డాక్టర్ గఫూర్‌సాబ్, డాక్టర్ ఆరోహి, మాజీ సర్పంచ్ షేక్ ఫక్రుద్దీన్ హాజరయ్యారు. అనంతరం మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన చిన్నారులకు ఖత్నా చేసి సంబంధిత కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డాక్టర్ నేమ్‌తుల్లా ఖాద్రీ, డాక్టర్ హనీఫ్, ఖాజీంబాషా సాహెబ్, షేక్ గౌస్‌సాబ్, పీర్ బాషా, నబిరసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఖత్నా కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

గొర్రెలు, మేకల పెంపకందారుల కమిటీ ఎన్నిక

ఉరవకొండ : మండల పరిధిలోని పెద్దముష్టూరు గ్రామంలో ఆదివారం గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.కుల్లాయప్ప, కార్యదర్శిగా బి.నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ఎం.వెంకటేశులుతోపాటు 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు పెద్దముష్టూరు వెంకటేశులు, కుళ్లాయప్ప మాట్లాడుతూ గొర్రెలకాపరులకు వేసవికాలంలో సబ్సిడీ దాణా, మేత, తాగునీటి తొట్టెలు, బీమా సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.రాజు, ఎరుకుల ఆనంద్, చాకలి వన్నూరు, ఎం.నాగరాజు, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు గార్లదిన్నెలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గార్లదిన్నె: ఈనెల 12వ తేదీన సోమవారం గార్లదిన్నెలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఈరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని సమస్యలను విన్నవించుకోవాలని కోరారు.

సైనికుల పిల్లలకు ఉచిత విద్య

తేజ కళాశాల కరస్పాండెంట్ తేజేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

దేశ రక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేస్తూ, అనుక్షణం దేశాన్ని కాపాడుతున్న సైనికవీరుల పిల్లలకు ఉచిత విద్యను అందించనున్నట్లు అనంతపురం తేజ కళాశాల కరస్పాండెంట్ తేజేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. దేశం కోసం పోరాడుతున్న సైనికులకు మూడుపూటలా కడుపు నింపుతున్న అన్నదాతలకు ఎంత చేసినా తక్కువే అన్నారు. అదే తరణంలోనే సైన్యంలో పని చేస్తున్న వారి పిల్లలకు అండగా ఇంటర్ విద్యతోపాటు లక్షల్లో ఖర్చు అయ్యే ఐఐటి, జెఇఇ, నీట్, సిపిటి వంటి కోర్సులను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భారత సైన్యంలో పని చేస్తున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

పామిడి : స్థానిక వాసవీ కళ్యాణ మండపం అమ్మవారి శాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు కంటి వైద్య నిపుణురాలు యనాక్షి కలిసి దాదాపు 210 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 72 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. పామిడి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ పత్రా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జయరామ్‌రావు, కోశాధికారి షేక్షావలి, జిల్లా ఛైర్‌పర్సన్ డాక్టర్ మురళీకృష్ణ, మెంబర్‌షిప్ ఛైర్‌పర్సన్ డాక్టర్ శాంతిప్రియ, క్లబ్ డైరెక్టర్స్ గంగ శేఖర్, కిరణ్, ముండే షేక్షావలి, నరేష్, రాకేష్, ప్రభాకర్, వాసవి కళ్యాణ మండపం ఉపాధ్యక్షుడు నల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో బాలబాలికలకు ఆత్మరక్షణ

గుమ్మనూర్ ఈశ్వర్

ప్రజాశక్తి-పామిడి

బాల బాలిక ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు, పామిడి, గుత్తి మండలాల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని టంగుటూరి చిన్నప్ప శెట్టి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అనంత డ్రాగన్ మార్షల్ ఆర్ట్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీని ఈశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు, క్రీడలు కూడా అవసరమే అన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరికి ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమన్నారు. అనంతరం పలు విభాగాల్లో క్రీడాకారులు పోటీ పడగా, విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సెక్రటరీ సాకే గోవిందు, సినీ డైరెక్టర్, ఫైట్ మాస్టర్ సాకే అశోక్ రాజు, ఇంటర్నేషనల్ కరాటే ప్లేయర్ శ్వేత, కాదాసి రాణి, మహిళా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఆంధ్ర, తెలంగాణ అధ్యక్షురాలు హిమబిందు, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, కత్రిమల ప్రభాకర్, లీలా మనోహర్, మానసిక నిపుణులు ఎన్.రారాజు, కోచ్ రాఘవేంద్ర, టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఛైర్మన్ రంగన్న పాల్గొన్నారు.

త్యాగధనుడి సేవలతో భారతావని పునీతం

రాయదుర్గం : చిన్న వయసులో దేశసేవలో ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్ సేవలతో భారతావని పునీతమైందని విప్ కాలవ శ్రీనివాసులు కొనియాడారు. పాకిస్థాన్ యుద్ధంలో ప్రాణాలు వదిలిన సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం తల్లిదండాకు చెందిన మురళీనాయక్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తనవంతు సాయంగా మురళి కుటుంబానికి తనవంతుగా రు.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం రాయదుర్గం చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తరపున రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబులు ఘన వీడ్కోలు పలికారన్నారు. నారా లోకేష్ స్వయానా అంతిమ యాత్రలో పాల్గొని పాడిమోయటం చూస్తే ఆయనకున్న బాధ్యతను గుర్తు చేస్తుందన్నారు. కుమారుడి మరణ బాధ నుంచి కుటుంబం త్వరగా కోలుకునేలా ఆ భగవంతుడు ఆశీస్సులు అందజేయాలని కోరుకున్నారు.

ఏకగ్రీవంగా ఉద్యోగ సంఘం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన ఉద్యోగుల సంఘం కమిటీ సభ్యులు

రాయదుర్గం రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపీకష్ణ తెలిపారు. ఆదివారం రాయదుర్గం పట్టణంలోని పశు వైద్యశాలలో ఉద్యోగ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నవీన్‌కుమార్, సెక్రటరీగా రామాంజనేయరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నూర్‌బాషా, ట్రెజరర్‌గా సూర్యనారాయణరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా రేణుకాదేవి, ఆదినారాయణ, గోవిందప్ప, సుబ్రమణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్లుగా సరోజ, ప్రమీల, రూప, హరికృష్ణానాయక్, వసంతకుమార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గుత్తి : మండలంలోని ధర్మాపురం గ్రామంలో ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహేంద్ర కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఆ బాధను భరించలేక మూడు రోజుల క్రితం గ్రామ శివారులోని పొలాల్లోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతన్ని కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పేకాట జూదరుల అరెస్టు

రాయదుర్గం : పట్టణంలోని పార్వతీనగర్ ప్రాంతంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసు ఇన్స్‌పెక్టర్ జయానాయవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు పేకాట జూదరులను అరెస్టు చేసి 52 పేక ముక్కలు, రూ.5,400 నగదు, 4 మోటార్ సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థిపై కుక్క దాడి

యల్లనూరు : మండల కేంద్రంలో 8వ తరగతి చదువుతున్న వినోద్‌పై ఓ కుక్క దాడి చేసి గాయపరిచింది. ఆదివారం మధ్యాహ్నం వినోద్‌పై కుక్క దాడి చేయడంతో కుడి చేతి మనికట్టుకు 9 కుట్లు పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజుల క్రితం కూడా ఓ కుక్క బాలుడిపై దాడి చేసిన ఘటన మరువకముందే మరో బాలుడిపై దాడి చేయడంతో స్థానికులు భయాందోళ చెందుతున్నారు. మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను బయటకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.